సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌ను కోరిన బీఆర్ఎస్ నాయకులు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు జహీరోద్దీన్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 24: రాజేంద్రనగర్ నియోజకవర్గం సులేమాన్ నగర్ డివిజన్‌లో సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎండీ .జహీరోద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వృద్ధులు, వితంతువులు పెన్షనర్లు, పెన్షన్‌కొరకు సుదూర ప్రాంతమైన బండ్లగూడ జాగీర్‌కు వెళ్లాల్సి వస్తుందని, ప్రత్యేక ఆటోల్లోవెళ్లి దిన మంతా వేచిచూడాల్సి వస్తుందన్నారు. రూ.200 నుంచి 400 ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానికంగా గల వార్డు కార్యాలయంలో ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. స్థానికంగా శానిటేషన్ సమస్య అధికంగా ఉందన్నారు. మిర్యాలం ట్యాంక్ సమీపంలో గల సులేమాన్, హసన్‌నగర్, బాబానగర్‌లలో గల పలు కాలనీలలో రాత్రివేళ దోమల బెడద, విషసర్పాలు సంచరిస్తున్నా మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు అష్రఫ్, ఇబ్రహీం, దేవదాసుతో పాటు పలువురు కాలనీ వాసులు పెద్ద ఎత్తున కలిశారు.

వివిధ కోర్సుల పరీక్షా

ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటన లో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలతో పాటు ఎంఫిల్ రిహాబిలిటేషన్ సైకాలజీ పార్ట్ 2 రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం

- నాలుగు ఏసీలు దగ్ధం.. వేడికి కాలిన రెండు కార్లు
- ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం



ఫర్నిచర్ గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

మణికొండ,ఫిబ్రవరి 24 : జనవాసాల మధ్య ఏర్పాటైన ఫర్నిచర్ గోదాంలో చెలరేగిన మంటలతో చుట్టుపక్కల ఉన్న నివాసితుల ఇళ్లలో సామగ్రి దగ్ధమైన ఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. విద్యుత్‌శాఖ, మున్సిపాలిటీ, అగ్నిమాపకశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందంటూ స్థానిక ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. కొన్నాళ్లుగా జనవాసాల మధ్యలో ఫర్నిచర్ గోదాంలను ఏర్పాటు చేయవద్దంటూ మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా అనుమతులు ఇచ్చాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే... నార్సింగి మున్సిపాలిటీ గీతాంజలి పాఠశాల సమీపంలోని మణికొండ మున్సిపల్ పరిధిలోని మలేషియా సోఫాసెట్ ఫర్నిచర్ గోదాంలో సోమవారం విద్యుత్‌షాక్‌తో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎగిసిపడిన ఈ మంటలతో పక్కనే ఉన్న అపార్టుమెంటు వాసులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. దాదాపు ఇరవై అడుగుల ఎత్తులో మంటలు ఎగిసిపడటంతో అపార్టుమెంటు నివాసితుల ఏసీ కంప్రెషర్లు, పార్కింగులో ఉన్న రెండు కార్లు మంటల వేడికి కాలిపోయాయి. ప్రమాదాన్ని గమనించిన నిర్వాహకులు అక్కడ నుంచి పరారయ్యారని, నిర్వాహకులపై, భూమి యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం

హరికృష్ణారెడ్డి, నార్సింగి ఇన్‌స్పెక్టర్

జనవాసాల మధ్యలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్ గోదాం నిర్వాహకులతో పాటు భూ యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. స్థానికుల అభ్యంతరాలుంటే ఏర్పాటు చేయవద్దని ఆయన సూచించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇకపై ఏర్పాటయ్యే ఫర్నిచర్ గోదాంలకు సరియైన అనుమతులు లేకపోతే సీజ్ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

గంట తర్వాత వచ్చిన అగ్నిమాపక బృందం

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద ఘటన విషయం తెలిసిన గంట తర్వాత అగ్నిమాపక సిబ్బంది రావడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఫర్నిచర్ గోదాం వరకు ఫైర్ ఇంజన్ రావడానికి కూడా రహదారి సక్రమంగా లేకపోవడంతో సమస్య తలెత్తిందని స్థానికులు ఆరోపించారు.

పాత పెన్షన్ విధానం అమలుకు కృషి

మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న పురుషోత్తం రెడ్డి, రాజిరెడ్డి, ప్రొఫెసర్ రేఖా రావు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 24 : ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయించి పాత పెన్షన్ విధానం అమలయ్యే విధంగా కృషి చేస్తానని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్యఅభ్యర్థి తలకోల పురుషోత్తం రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పీఆర్సీ ప్రకారం 53 శాతం ఫిట్మెంట్ చెల్లింపులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, డిజిటల్ తరగతులు, స్మార్ట్ ల్యాబ్ నిర్వహణ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సంక్షేమ బోర్డు, ఉచిత విద్య ప్రోత్సహకాలు, నైపుణ్యాభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ తదితర డిమాండ్ల తో మ్యానిఫెస్టోను రూపొందించామన్నారు. అనంతరం మ్యానిఫెస్టోను అరబిందో ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ రాజిరెడ్డి, విద్యావేత్త ప్రొఫెసర్ రేఖా రావు, ఆర్టిస్ట్ రుద్ర రాజేశ్ తో కలిసి ఆవిష్కరించారు.

సీపీఐ పార్టీపై చర్యలు తీసుకోవాలి



నారాయణగూడ పీఎస్‌లో ఎస్సై నాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న రాష్ట్రీయ వానర సేన సభ్యులు

హిమాయత్ నగర్ , ఫిబ్రవరి 24: ఛత్రపతి శివాజీ చరిత్రను వక్రీకరించి తప్పుడు ప్రకటనలు చేసిన సీపీఐ పార్టీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నారాయణగూడ పీఎస్‌లో రాష్ట్రీయ వానరసేన సభ్యులు ఫిర్యాదు చేశారు. శివాజీ జయంతి సందర్భంగా సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19న హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద శివాజీ కటౌట్ ను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీపీఐ పార్టీ నాయకులు శివాజీపై అసత్య ప్రకటనలు చేసి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేసి ఈ అసత్య ప్రచారం చేసిన సీపీఐ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ వానరసేన ప్రధాన కార్యదర్శి మహేశ్వరం రవి చంద్ర, వ్యవస్థాపక సభ్యులు మాధవరెడ్డి,నాయకులు ఎడ్ల కేశవ వర్ధన్ రెడ్డి, మందాడి శివారెడ్డి, విష్ణుషా యాదవ్, సూర్యవంశీ, గూడ ఉమారెడ్డి, కాశయ్య, గోరక్షక్ జాతీయ అధ్యక్షుడు శ్రీరామ్ కుమార్ జోషి పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో

సెల్‌ఫోన్లు మాయం

-పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

మణికొండ, ఫిబ్రవరి 24 : గండిపేట తహసీల్దారు కార్యాలయంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చామంటూ ఏకంగా రెవెన్యూ సిబ్బందికి సంబంధించిన పోన్లనే మాయం చేసిన వైనమిది. సోమవారం ముగ్గురు మహిళలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను కలిసేందుకు వచ్చి ఫిర్యాదులు పత్రాలను నింపుతూ టేబుల్ పైన ఉన్న మహిళా అటెండర్ సెల్‌ఫోన్‌ను తస్కరించారు. ఎంతకీ తన ఫోను ఆచూకీ లభించకపోవడంతో సదరు మహిళ తహసీల్దారు కార్యాలయంలోనే సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ముగ్గురు మహిళలు టేబుల్ పైన ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించినట్లు గుర్తించారు. వెంటనే వారిని పట్టుకుని విచారించగా తాము తీయలేదంటూ బుకాయింపులు మొదలుపెట్టారు. గతంలోనూ ఇదేవిధంగా తమ సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లిపోయారంటూ సహచర సిబ్బంది తెలిపారు. అనుకోకుండా తీసుకుంటే తిరిగి ఇవ్వడంటూ అధికారులు ఎంత చెప్పినా తమకేమీ తెలియదంటూ సదరు మహిళలు తెలుపడంతో తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ముగ్గురు అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపడుతున్నారు.

విద్యార్థులు మనోధైర్యంతో లక్ష్యాన్ని చేధించాలి

సంగీత దర్శకుడు మణిశర్మ

ఫిలింనగర్‌లో ఫైవ్ ఫింగర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎగ్జామ్ కిట్స్ అందజేస్తున్న సంగీత దర్శకుడు మణిశర్మ

బంజారాహిల్స్,ఫిబ్రవరి 24: విద్యార్థులు తమ ముందున్న లక్ష్యాన్ని మనోధైర్యంతో చేధించాలని, ఓటమి ఎదురైనా కుంగిపోవాల్సిన అవసరం లేదని ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. ఫైవ్ ఫింగర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగీతదర్శకుడు మణిశర్మ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వేణు కళ్యాణ్ విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఒత్తిడిని ఎలా జయించాలి..లక్ష్యాన్ని ఎలా చేధించాలి అనే అంశాలపై శిక్షణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైవ్ ఫింగర్స్ ప్రతినిధులతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు

రుణాలు మాఫీ చేయాలి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 24: రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంక ట్రాములు సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జియోట్యాగ్ లేని మగ్గాలన్నింటికీ జియోట్యాగ్ వేసి, చేనేత కార్మికులకు నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్) వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. చేనేత అభయ హస్తంను అమలును వేగవంతం చేసి అర్హులైన కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సహకార వ్యవస్థను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత రంగానికి ఐదువేల కోట్ల నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

28 నుంచి అంతర్జాతీయ మహిళా సదస్సు

అమీర్‌పేట, ఫిబ్రవరి 24 : మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (డబ్ల్యూఐఎస్ఈ), బీ2బీ ఎక్స్‌పో 2025.. ఫిబ్రవరి 28 నుంచి రెండు రోజులపాటు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో నిర్వహించనున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ జాతీయ అధ్యక్షురాలు లలితా ఆలూరి తెలిపారు. సోమవారం బేగంపేట్‌లోని హోటల్ ప్లాజాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ..ఈ సదస్సును తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రారంభించనున్నారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో యూనిఫామ్స్ అందజేత

అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న యూత్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 24: విద్యార్థులు అన్ని రంగాల్లో పాలు పంచుకున్నప్పుడు విజ్ఞానవంతులుగా ఎదుగుతారని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్ప కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డిలు అ న్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుంన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిత, సంగీత తదితరులున్నారు.

4న స్వాతంత్ర్యస్రమరయోధురాలు

పొణక కనకమ్మ స్మారక అవార్డులు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాశం యాదగిరి, సురేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 24 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక సేవకురాలు పొణక కనకమ్మ స్మారక అవార్డుల ప్రదానోత్సవం మార్చి 4న రాజ బహుదూర్ వెంకట్రామా రెడ్డి భవనంలో నిర్వహిస్తున్నట్లు దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి కార్యదర్శి, పొణక కనకమ్మ ఆశయ సాధన సమితి కన్వీనర్ బి. సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితం దివంగత కనకమ్మ తన ఆస్తి మొత్తాన్ని బాలికల విద్య, మహిళా సంక్షేమం కోసం విరాళంగా ఇచ్చారని తెలిపారు. 4న జరిగే కార్యక్రమంలో రచయిత, నెల్లూరు పద్య కళాశాల పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్, పొణక కనకమ్మ, జమీన్ రైతు పత్రిక స్మారక అవార్డు కవి, గాయకులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సాహిత్యవేత్త, కవి, రచయిత వాడ్రేవు చిన్న వీరభద్రుడు తదితరులకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం వేడుకలకు సంబంధించిన కరపత్రాలను దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి, పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి ఉపాధ్యక్షులు కొండా లక్ష్మీకాంత రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరితో కలిసి ఆవిష్కరించారు.

మార్చి 19,20 తేదీల్లో జాతీయ సదస్సు

నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజేందర్ సింగ్

హిమాయత్ నగర్ , ఫిబ్రవరి 24: మానవ మనుగడ పర్యావరణంతోనే సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ ఆర్. రాజేందర్ సింగ్, బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మానవాళి అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మార్చి 19,20 తేదీల్లో నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగే జాతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం వారు నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సత్య నారాయణరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సునీత, డాక్టర్ రాపోలు శ్రీనివాస్, సి.వి.ఎల్ నారాయణ,వై.ఉమా, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ జె.గంగాధర్, డాక్టర్ రాజేశ్వర్, ఎల్.రవి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ శరత్‌చంద్రపై

చర్యలు తీసుకోవాలి

పురపాలకశాఖ ప్రిన్సిపల్ దాన కిషోర్‌కు హరీష్‌గౌడ్ ఫిర్యాదు



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రపై ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హరీశ్‌గౌడ్

బండ్లగూడ, ఫిబ్రవరి 24: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ శరత్ చంద్రపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల పట్ల ఆయన వ్యవహరిస్తున్న తీరుపై పురపాలక శాఖ ప్రిన్సిపల్ దాన కిశోర్‌కు స్థానికుడు హరీష్‌గౌడ్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హరీష్‌గౌడ్ మాట్లాడుతూ సమస్యలపై బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్రను కలిసి విన్నవిస్తే తమపై ఇష్టానుసారంగా మాట్లాడి వెళ్లగొట్టారన్నారు. అంతేకాకుండా సామాన్య ప్రజలతో కూడా ఇలాగే వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన వి చారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు హరీష్ గౌడ్ తెలిపారు.

రేపటినుంచి టీటీడీ

ఆలయ బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 24: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 26 నుండి మార్చి 6వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 25 సాయంత్రం అంకురార్పణ, 26న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 2న గరుడ వాహన సేవ, మార్చి 5న రథోత్సవం, మార్చి 6న చక్రస్నానం నిర్వహించనున్నట్లు చెప్పా రు. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్ర హ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులతో కలిసి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలో.. ముందస్తు అడ్మిషన్లు నిలిపివేయాలి

నారాయణగూడలో ఆందోళన చేస్తున్న పీడీఎస్ నేతలు

హిమాయత్ నగర్ ,ఫిబ్రవరి 24: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తీసుకునే ముందస్తు అడ్మిషన్లను నిలిపి వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్,నగర అధ్యక్షుడు ఎస్.రాకేష్ డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం వత్తాసు పలకడాన్ని నిరసిస్తూ సోమవారం నారాయణగూడలో ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరిగే ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియకు అడ్డుకట్ట చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కాలేజీలకు అనుమతి రాకముందే అడ్మిషన్లు తీసుకుంటూ లక్షల రూపాయాలను ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని, తక్షణమే వాటిని గుర్తించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ నగర కార్యదర్శి హరీష్, నేతలు దీక్షిత, నవీన్, అనిల్, శివ, భార్గవి, హరిణి, బీమా లోకేష్, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వండి

చెక్కుల పంపిణీలో కార్పొరేటర్ దేదీప్య రావు డిమాండ్

ఆర్డీవో,తహసీల్దార్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దేదీప్య, రాజ్ కుమార్ తదితరులు.

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 24: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలని కార్పొరేటర్ దేదీప్య రావు, రాజ్‌కుమార్ పటేల్ అధికారులను కోరారు. సోమవారం ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన 269 మంది లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో సాయిరామ్, తహసీల్దార్ నయీముద్దిన్ లతో కలిసి యూసుఫ్‌గూడకు చెందిన 15 మందికి, వెంగళరావు నగర్ డివిజన్‌కు చెందిన 38 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, నర్సింగ్‌దాస్, వేణు, మహబూబ్, సమద్, కుమార్ నాయక్, వాణి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ నుంచి శ్రీశైలం వరకు శునకం

శంషాబాద్ పట్టణంలోని రాళ్లగూడకు చెందిన సిద్ధరెడ్డి(శివగురుస్వామి) రాజుయాదవ్ గురుస్వామి ఆశీస్సులతో ఈ నెల 14న సిద్ధరెడ్డి శివస్వామి ఆధ్వర్యంలో 11 మంది శివస్వాములు శంషాబాద్ పట్టణంలోని శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయం నన్నిదానం నుంచి శ్రీశైలం వరకు పాదయాత్ర నిర్వహించారు. వారితో పాటు సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద ఉండే ఓ శునకం వారితో పాటు యాదయాత్రగా వెళ్లి శ్రీశైలం నుంచి తిరిగి శంషాబాద్‌కు ఈ నెల 20న చేరుకున్నారు. వారితో పాటు శునకం సైతం చేరుకుంది.

–శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 24

రోడ్డు వేశారు..సమస్యను పరిష్కరించారు

వ్యవసాయ పొలాలకు వెళ్లడం కోసం దారిలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి ఇబ్బందులను గుర్తించి దారి ఏర్పాటు చేయించానని సోమవారం సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ దండుఇస్తారి తెలిపారు. శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి అనుబంధ గ్రామం కేబిదొడ్డి రెవెన్యూ పరిధిలో దాదాపు 15 మంది రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లడం ఇకసులభతరం అయిందన్నారు. కార్యక్రమంలో రైతులు ప్రభాకర్‌గౌడ్, మల్లికార్జున్,ననీరోభీన్,ఇటుకపల్లి సిద్ధయ్య, మొయినుద్దీన్,జి శ్రీశైలం,గోపాల్, శివగౌడ్, అంజయ్య, చాకలి పోచయ్య పాల్గొన్నారు.– శంషాబాద్ రూరల్

మహాశివరాత్రి మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 24: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ లోని చిన్న అనంతగిరి శివాలయంలో 50వ మహాశిరరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోంద్ర నర్సింహ తెలిపారు. ఈ నెల 25 నుంచి 27వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు సోమవారం దేవాలయం ప్రాంతంలో ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా మహా శివరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షులు సనివెళ్లి కృష్ణ, మల్లారెడ్డి, కోశాధికారి ఎస్.హరినాథ్, కొండమీది హరినాథ్, నారగూడెం మల్లారెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్లు

విక్రయిస్తున్నవ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 24: నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న పాన్‌షాప్ నిర్వా